ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 278 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం జనవరి 17, 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




### నేటి నుంచి బెంగాల్లో
## మోడీ పర్యటన

**పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని**

**న్యూఢిల్లీ, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీఈనెల 17,18 తేదీల్లో పశ్చిమబెంగాల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొంటారు. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్(÷ూఎఫ్) పక్రియ, టీఎంసీ రాజకీయ కన్సెల్టెన్సీ ఐ-ప్యాక్ పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో ..మిగతా 2లో

## మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం

**ఎల్ అండి టి నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి**

**సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో ..మిగతా 2లో



## త్వరలోనే అన్నీ ప్రభుత్వ
# ఖాళీల భర్తీ

**సీఎం రేవంత్ రెడ్డి**

**గత ప్రభుత్వం సొంత లాభం చూసుకుంది**

**కుటుంబం, పార్టీ, రాజకీయ అవసరాలే ప్రాధాన్యంగా పని చేసింది**

**గ్రూప్-3 ఉద్యోగాల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్ రెడ్డి**





**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆక్షేపించారు. గత ప్రభుత్వం సొంత లాభం చూసుకుందని, కుటుంబం, పార్టీ, రాజకీయ అవసరాలే ప్రాధాన్యంగా పని చేసిందని మండిపడ్డారు. వారి ఉద్యోగాలు ఊడితేనే నిరుద్యోగులకు కొలువులు వస్తాయని యువత భావించిందన్నారు. దీంతో వారి ఉద్యోగాలు ఊడగొట్టి, ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. 14 ఏళ్ల పాటు గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే వారు సంవత్సరాలుగా నోటిఫికేషన్ల కోసం ఎదురు చూశారని అన్నారు. గత ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని అభిప్రాయపడ్డారు. పరీక్షల పేపర్లు లీకవ్వడం, మళ్లీ మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. దీని ద్వారా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను ..మిగతా 2లో



## తుమ్మిడిహట్టి వద్ద
# ప్రాజెక్టు కడతాం

**ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం : సీఎం రేవంత్ రెడ్డి**

**ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామన్న సీఎం**

**జిల్లాలో రూ.386.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**కేంద్రం నుంచి రావల్సిన నిధుల కోసమే ప్రధానిని కలుస్తున్నామని ప్రకటన**

**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి నిర్మల్‌కే వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే ముఖ్యమంత్రి అయినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మొదటి బహిరంగసభ పెట్టామని చెప్పారు.

ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అని జల్, జంగల్, జమీన్ అంటూ కుమరంభీం కొట్లాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి ..మిగతా 2లో

### జైపాల్ రెడ్డికి
## రేవంత్ నివాళి



**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. నెక్లెస్ రోడ్ లోని జైపాల్ సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి, దేశానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి చిన్నారెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



### వానాకాలం సీజన్‌లో
## కందుల కొనుగోళ్లు

**రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన**

**లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి ..మిగతా 2లో

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై
# ధిక్కరణ కేసు

**అనర్హత ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన**

**కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత**

**హైదరాబాద్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ(÷ుగ్గ ÷జీనిణజీనిజీ ఃఏఖ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్‌పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందుపరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు ..మిగతా 2లో

# మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం

**మొదటి పేజీ తరువాయి...**

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర



ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

# తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడతాం

**మొదటి పేజీ తరువాయి...**

జరగలేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇచ్చి, పారిశ్రామికంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

మాజీ సీఎం కేసీఆర్ అనుకుంటే పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ లేదని వెంటనే వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బాసర ఐఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్న సీఎం నిర్మల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కడతాం : తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే, ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామని, ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తామని అన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దామని చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి మోదీని కలుస్తున్నామని, రాష్ట్ర బీజేపీ నేతలు కూడా రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలని కోరారు.

"ఆదిలాబాద్ జిల్లాకు వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా. యూనివర్సిటీ తప్పకుండా వస్తుంది. బాసర ఐఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తాం. దీని కోసం ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లిని కోరుతున్నా. నిర్మల్‌లో ఏటీసీ ఏర్పాటు చేస్తాం. ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం" –సీఎం రేవంత్ రెడ్డి

అభివృద్ధి, నిధుల కోసం ఎవరినైనా కలవడానికి తాను సంకోచించనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని, అడగాల్సిన ప్రాజెక్టులు అడిగామన్నారు. పదేళ్లపాటు కేంద్రప్రభుత్వాన్ని గత ప్రభుత్వం ఏమి అడగలేదని, అలా చేస్తే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలకులు చేసిన అప్పులు ఉరితాడై ప్రభుత్వం ఊపిరి పోతుందని విమర్శించారు. ప్రధాని మోదీని పదే పదే కలుస్తున్నానని కొంతమంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

ప్రధానిని కలిస్తే తప్పేంటి? : రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇచ్చేది కేంద్రం, ప్రధాని కాదా? అని ప్రశ్నించారు. ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి? అని మండిపడ్డారు. నాగోబా జాతరకు రూ.22 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని, సమ్మక్క–సారలమ్మ జాతరకు రూ.300 కోట్ల కేటాయించి పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందని, పెట్టుబడుల కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు



సీఎం తెలిపారు. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇస్తే సలహాలు ఇవ్వాలి లేకుంటే ఫామ్‌హౌస్‌లో కూర్చోవాలని పరోక్షంగా విమర్శించారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు.

ప్రజా ప్రభుత్వంతో పని చేయండి : సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, మీరందరూ తమ వెంట ఉంటే తెలంగాణను దేశంలోనే నంబర్ 1 చేస్తామని రేవంత్ రెడ్డి కోరారు. ప్రజాప్రభుత్వంతో కలిసి పనిచేసేవారిని గెలిపిస్తే మన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని మీడియాలో వార్తలు వస్తున్నాయని, ఆశావహులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. నిర్మల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడే ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

అంతకు ముందు ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకా–కొరాటా పంప్‌హౌస్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.సదర్మాట్ బ్యారేజీ ప్రారంభం : అనంతరం నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ చేరుకున్న సీఎం గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ కుమార్ జాదవ్, వెడ్మ బొజ్జు, సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పిదాల వల్లే గోదావరి నీళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఎక్కువ వరి పంట పండించిందని పేర్కొన్నారు. మిగిలిన సాగునీటి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. స్థానికి ఎమ్మెల్యే కోరినట్లు ప్యాకేజీ 27 భూ సేకరణ కోసం రూ.97 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. లక్ష ఎకరాలను సాగులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే ఏపీ ప్రభుత్వం పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతుందని దానికి తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఆ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కూడా పోరాడుతున్నట్లు తెలిపారు.



# త్వరలోనే అన్ని ప్రభుత్వ ఖాళీల భర్తీ

**మొదటి పేజీ తరువాయి...**

దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు ఇవ్వడం మా బాధ్యత : గ్రూప్–1 ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చే సమయంలో కూడా కొంతమంది కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారని, అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వడం తమకు బాధ్యత అని మీకు జీవితమని కొత్త ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం తీసుకోవడం కాదు ఒక భావోద్వేగమని అభివర్ణించారు.

ప్రస్తుతం అందరికీ విద్య అందుతుంది కానీ నాణ్యమైన విద్య అందడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల మీద ప్రజలకు ఎందుకు విశ్వాసం పెరిగింది? అని ప్రశ్నించారు. ఉచితంగా విద్య ఇస్తున్నా ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలు ఎందుకు రావట్లేదు? అని ఆలోచించాలన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తే, ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను వారి తల్లిదండ్రులే పంపిస్తారని పేర్కొన్నారు."రాబోయే కాలంలో అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రాజకీయ నాయకులు ఉచ్చులో యువత పడొద్దు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే జీతంలో 15 శాతం కోత విధిస్తాం. అత్తారింటికి వెళ్లినా తల్లిదండ్రుల బాధ్యత కుమార్తెలదే. అత్తగారి ఇంటి నుంచి ఒత్తిడి ఉంటే నాకు చెప్పండి. మీ జీతం నుంచి 15 శాతం మీ తల్లిదండ్రులకు ఇచ్చేస్తాం. తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోనివారు మానవజన్మ ఎత్తడానికి అర్హులు కాదు" –రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రివిద్యతోనే పేదరికం పోతుంది : ఇప్పుడు ఆహార ధాన్యాలకు ఎటువంటి లోటు లేదని, ప్రోటీన్ ఫుడ్ ఇవ్వలేకపోతున్నామని సీఎం అన్నారు. నాణ్యమైన, బలమైన ఆహారం పేదలకు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ చేసి బయటకు వస్తున్నారని, అందరికీ ఎందుకు ఉద్యోగాలు రావట్లేదు? అని అన్నారు. జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ఉన్నా స్కిల్ లేక అందుకోలేకపోతున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోసం యువత ప్రయత్నించాలని కోరారు. ఒకప్పుడు పేదరికం పోగొట్టడానికి ప్రభుత్వం భూములు ఇచ్చేదని, ఇప్పుడు ఇవ్వడానికి భూములు లేవని, కేవలం నాణ్యమైన విద్యను మాత్రమే అందించగలమని పేర్కొన్నారు. విద్య ఒక్కటే పేదరికాన్ని పోగొడుతుందని, విద్యతోనే గౌరవం వస్తుందని, మిగతా వాటితో రాదని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.రాబోయే రోజుల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తాం : త్వరలోనే అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువత రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు దశలు గరం, నరం, భేషరం ఉంటాయంటా చమత్కరించారు. ఉద్యోగం వచ్చినప్పుడు ఉన్న గరం చివరి దశ వరకు ఉండాలన్నారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే ఉద్యోగుల జీతంలో 15 శాతం కోత విధిస్తామని సీఎం తెలిపారు. అత్తగారి ఇంటికి వెళ్లినా తల్లిదండ్రుల బాధ్య ఆడవాళ్లదే అని చెప్పారు. అత్తగారి ఇంటి నుంచి ఒత్తిడి ఉంటే తనకు చెప్పాలని, మీ జీతం నుంచి 15 శాతం మీ తల్లిదండ్రులకు ఇచ్చేస్తామన్నారు. తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోనివారు సమాజంలో మానవ జన్మ ఎత్తడానికి అర్హులు కాదని పేర్కొన్నారు.

## నేటి నుంచి బెంగాల్లో మోడీ పర్యటన

**మొదటి పేజీ తరువాయి...**

మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. మైనారిటీల ఆధిపత్యం ఉన్న మాల్డాలో ఈనెల 17న జరిగే బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొంటారు. సింగూర్‌లో జరిగే మరో ర్యాలీకి కూడా హాజరవుతారు. శనివారం సాయంత్రం మాల్డాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు. ఆ రాత్రి కోల్‌కతాలోనే బస చేస్తారా అనేది మాత్రం వెల్లడించలేదు. పీఐబీ ప్రకటన ప్రకారం.. ప్రధాని జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12:45 గంటలకు మాల్డా చేరుకుంటారు. హౌరా–గౌహతి మధ్య నడిచే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఆదివారం నాడు హుగ్లీ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. ఎస్ఐఆర్ పేరుతో సాధారణ పౌరులను బీజేపీ, ఎన్నికల కమిషన్ వేధిస్తోందని.. దీనికి బ్యాలెట్ బాక్స్ వద్దే ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలని అధికార టీఎంసీ కొద్దిరోజులుగా విమర్శలు గుప్పిస్తోంది. అయితే.. ఈ వాదనలను బీజేపీ తోసిపుచ్చుతోంది. అక్రమ వలసదారులు, రోహింగ్యాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్ తప్పనిసరని, గణనీయంగా తమ ఓటు బ్యాంకు కోల్పోతోందనే అక్కసుతోనే టీఎంసీ తప్పుడు ఆరోపణలను చేస్తోందని చెబుతోంది.

# వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025–2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ÷ూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ÷ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన. వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటీషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు ఏలేటి. ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఎలాంటి పరిణామాలు ఉండవనే భావన పెరుగుతుందని బీజేపీ తన పిటిషన్‌లో రాసుకొచ్చింది.ఇప్పుడీ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుతో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో.. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# అష్టోత్తర శతకలశ శోభితం... అయ్యప్ప నామస్మరణతో దక్కన్ శబరి పీఠం





**హరిహరసుతునికి అష్టోత్తరశతకలశాభిషేకాలు**

**భక్తుల మదిని దోచిన అష్టోత్తరశతకలశ అలంకరణ.**

**ప్రథమంగా గణనాథునిపూజలు.. సుబ్రమణ్యస్వామికి భక్తుల మొక్కులు**


**శ్రీగంగా, శ్రీపార్వతీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామివార్లకు మహా రుద్రాభిషేకం.**

**శ్రీ అయ్యప్ప సేవ సమితి ఉపాధ్యక్షుడు, ఇందిరాగాంధీ హౌసింగ్ కో- ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సంకూరి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో విజయవంతంగా పూజలు.**

రాజేంద్రనగర్, జనవరి16( ప్రభాత ఉదయం) తాంత్రిక, వేద శాస్త్రోక్తంగా శబరిమలలో ఆస్వామివారికి



అందించే కలలశాభిషేక పూజా సేవను కాటేదాన్ మణికంఠ హిల్స్ లోని దక్కన్ శబరి పీఠంలో అత్యంతం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తుల నోట స్వామి యే శరణం అయ్యప్ప నామస్మరణ.. పండితుల మంత్రోత్సరణలు ఆద్యంతం అష్టోత్తర శతకలశ శోభితం పూరితంగా దక్కన్ శబరి పీఠం శోభాయమానంగా సంతరించుకుంది. శుక్రవారం కాటేదాన్ దక్కన్ శబరి పీఠంలో తెల్లవారు జాము 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యావాచనా, పంచగవ్య ప్రాసనా, గణపతి హెూమం, దుర్గాసూక్తి.. ఆదిత్యాది నవగ్రహ హెూమాదులు కొనసాగాయి. ఉదయం 8.30 గంటల నుంచి 12 గంట వరకు శ్రీ అయ్యప్పసేవా నమితి ఉపాధ్యక్షుడు. సంకూరి జయప్రకాష్, పావని దంపతుల ఆధ్వర్యంలో నిరవదికంగా మహాగణాధిపతి, శ్రీ సుబ్రమణ్యస్వామి సహిత దక్కన్ శబరిగిరీశునికి అష్టోత్తర శతకలశాభిషేకాలు చేశారు. పూర్ణహుతి అనంతరం పండితులు భక్తలకు వేధ ఆశీర్వచనం అందించారు. తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మాస శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శ్రీగంగా, శ్రీపార్వతీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామివారికి మహా రుద్రాభిషేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు శ్రీ అయ్యప్పసేవా సమితి ప్రతినిధులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు



## బిజెపి సీనియర్ నాయకులు తోకల శ్రీశైలం రెడ్డి, రాజేంద్రనగర్ బిజెపి ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**రాజేంద్రనగర్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొని సుఖ సంతోషాలతో ఉండాలని బిజెపి సీనియర్ నాయకులు తోకల శ్రీశైలం రెడ్డి అన్నారు. శుక్రవారం సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ ప్రగతి కాలనీ నివాసం లో రాజేంద్ర నగర్ నియోజక వర్గ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తోకల శ్రీశైలం రెడ్డి , రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ని మైలర్ దేవ్ పల్లి డివిజన్ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారికి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ... మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే రోజుతో మొదలై, భోగి, మకర సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు జరుపుకునే గొప్ప పండుగ ఇది పాడి పంటలకు కృతజ్ఞత, కొత్త ఆరంభాలకు సంకేతం, గాలిపటాలు ఎగురవేయడం, పిండివంటలతో ఇళ్లను అలంకరించడం, గోపూజలు చేయడం ముఖ్య సంప్రదాయాలు తెలుపుతూ ఆ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని జీవితం లో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించడం జరిగింది. భగవంతుని చల్లని ఆశీస్సులు ప్రజలందరి పై ఎల్లపుడు ఉండాలని ఆకాంక్షించడం జరిగింది మరోసారి ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు పాండు యాదవ్, జోగి రవి, రావుల భాస్కర్, సంతు గౌడ్, బుచ్చి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, బబ్లూ, సిహెచ్.రమణ మధుసూదన్ రెడ్డి,ప్రభుదాస్ బి. నరసింహ, గోపాల్ నాయక్, కుర్మయ్య, మజార్ భాయ్, ఎన్ను శంకర్ రెడ్డి, సిహెచ్ ప్రభుదాస్, గోవర్ధన్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, రామ రావు, బోల్ల రామ కృష్ణ, శివ, మహమ్మద్ షకీల్, యాదగిరి, గోవర్ధన్, శ్రీకాంత్, జి శంకర్, మధుసూదన్ రెడ్డి, భూషణ్ భాను ,శేఖర్ పార్టీ నాయకులు యువ కార్యకర్తలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎం డీ ఎం ఎ డ్రగ్ ను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ పోలీసులు

## హసన్ నగర్‌లో 7 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్ స్వాధీనం

**బుద్వేల్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**



అన్వర్ హుస్సేన్



బుర్ర సంపత్

సులేమాన్ నగర్ డివిజన్ హసన్ నగర్ ప్రాంతంలో ఎండిఎంఎ డ్రగ్స్ తో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈ నెల 15న విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, అత్తాపూర్ పోలీసులు కలసి పట్టుకున్నారు. వివరాలను అత్తాపూర్ ఇన్స పెక్టర్ నాగేశ్వర్ రావు వెల్లడించారు. చింతల్మెట్ ప్రాంతానికి చెందిన అన్వర్ హుస్సేన్, బండ్లగూడ ప్రాంతానికి చెందిన బుర్ర సంపత్ అనే వ్యక్తులు హసన్ నగర్ ప్రాంతంలో తచ్చాడుతుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 7గ్రాముల ఎండీఎం ఏ డ్రగ న్ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఎండీఎంఏ డ్రగ్ ఎక్కడినుంచి వచ్చింది. ఎవరికి విక్రయించడానికి తీసుకువస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపారు.



గాయపడ్డ యువకులు

## గాలిపటాలు ఎగురవేస్తున్న సమయంలో సౌండ్ ఎక్కువగా పెట్టవద్దన్నందుకు రెండు గ్రూపుల మద్య గొడవ

**బుద్వేల్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

గాలిపటాలు ఎగురవేస్తున్న సమయంలో జరిగిన గొడవలో ఇరు గ్రూపులకు చెందిన ఏడుగురు వ్యక్తుల పై అత్తాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సం ఘటన గురువారం సాయంత్రం జరిగింది. ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... అత్తాపూర్ మారుతీనగర్ లో నందగోపాల్ బిరాదర్ అతని సోదరులు గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తమ ఇంటిపై గాలిపటాలు ఎగురవేసుకుంటున్నారు. అదే సమయంలో పక్క బిల్డింగ్ పై గాలిపటాలు ఎగురవేస్తున్న అనిల్, సంపత్, విద్యానాథ్ అనే యువకులు తమ భవనంపై సౌం డ్ సిస్టమ్ లో పాటలు పెట్టుకుని సౌండ్ ఎక్కువ గా పెట్టి గాలిపటాలను ఎగురవేస్తున్నారు. నంద గో పాల్ అగర్వాల్ సౌండ్ తగ్గించమని కోరగా గొడవ మొదలైంది. ఈ గొడవలో అనిల్, సంపత్, విశ్వనాధ్లతో పాటు మరి కొందరు వచ్చి నందగోపాల్, అతని సోదరులపై హాకీ సిక్స్ తో దాడి చేశారు. ఈ ఘటనలో రెండు గ్రూపులో ఉన్న సభ్యులకు గాయాలైనాయి. వారి నుంచి పిర్యాదు లు స్వీకరించిన పోలీసులు ఇరు గ్రూపులకు చెందిన ఏడుగురిపై కేసులు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.



## మార్కండేయ నగర్ కాలనీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**రాజేంద్రనగర్, జనవరి 16(ప్రభాత ఉదయం)**

మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ కాలనీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సంప్రదాయ పద్ధతిలో పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు కాలనీవాసుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వీడేం రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్ పాల్గొని పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే యూత్ అధ్యక్షుడు కోట పవన్‌తో పాటు మామిడి శెట్టి శ్రీనివాస్, ఉడుత సురేష్, గుత్తి మలేష్,చింటూ రెడ్డి, గంజి ధనంజయ్, బాత్కు విజయ్, మొగిలి రాజు,లలిప్, భారత్, పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు

గాలిపటాలతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు తోకల శ్రీశైలం రెడ్డి లు




**బుద్వేల్, జనవరి 16 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో గురు, శుక్రవారాలలో సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా జరిగాయి. గాలిపటాలు ఎగురవేస్తు యువకులు సంబరాలు చేసుకున్నారు. దేవాలయాలలో భక్తులు పూజలు చేసి ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, తండ్రి తోకల శ్రీశైలంరెడ్డి తో కలసి గాలిపటాలను ఎగురవేశారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై.శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలసి హిమాయత్ సాగర్ జలాశయం గట్టుమీద ఉన్న శ్రీ సౌడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు అక్కెం రాఘవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు బొక్క బాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేములు రామక్రిష్ణ లు గాలిపటాలను ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు.

గాలిపటాలు ఎగురవేస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జే ఏ సీ చైర్మన్ వేముల రామక్రిష్ణ






తోకల శ్రీనివాస్ రెడ్డి, తోకల శ్రీశైలం రెడ్డి లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



హిమాయత్ సాగర్ శ్రీ సౌడమ్మ తల్లి దేవాలయం వద్ద బీజేపీ నాయకులు వై శ్రీధర్

# పుట్టిన బిడ్డ ప్రయోజకుడు అయితే తల్లిదండ్రుల ఆనందం: సీఎం రేవంత్ రెడ్డి

## గ్రూప్-3 లో ఎంపికైన 1370 మంది అభ్యర్థులకు 25 ప్రభుత్వ శాఖల్లో నియామక పత్రాలు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 16(ప్రభాత ఉదయం)

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పైన ఆలోచన చేయలేదనీ, కుటుంబం మొదటి ప్రాధాన్యత, పార్టీ రెండో ప్రాధాన్యత, రాజకీయాలు మూడో ప్రాధాన్యతగా గత పాలకులు ఆలోచించారనీ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు

శుక్రవారం శిల్పాకళా వేదికలో కొలువుల పండుగ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని గ్రూప్-XXX లో ఎంపికైన 1370 మంది అభ్యర్థులకు 25 ప్రభుత్వ శాఖల్లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... పుట్టిన బిడ్డ ప్రయోజకుడు అయితే తల్లిదండ్రుల ఆనందం అంతా ఇంతా కాదని, కూలీ పని చేసి మరీ తల్లిదండ్రులు చదవించి పోటీ పరీక్షలకు తయారు చేశారనీ అన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లో విద్యార్థులు ఉద్యమకారులయ్యారనీ,

విద్యార్థులు అవసరమైన సందర్భంలో ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించారనీ తెలిపారు.

10 ఏళ్లలో రెండు సార్లు సీఎం అయిన వ్యక్తులు రాజకీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల కోసమే పని చేశారు.

తెలంగాణ యువత గురించి ఆలోచించలేదనీ,వాళ్ల ఉద్యోగాలు తొలగిస్తేనే మాకు ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నడుం బిగించారు కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

టీజీపీఎస్సీ లో దారుణ పరిస్థితులు అందరికి తెలుసనీ,14 యేళ్ల పాటు గ్రూప్ వన్ నియామకాలుచేపట్టలేకపోయారు.

ఇంత కంటే దారుణం, ఘోరం ఎక్కడైనా ఉంటుందా? 563 గ్రూప్ వన్ ఉద్యోగాల కోసం 5 లక్షల మంది అప్లికేషన్లు పెట్టుకున్నారనీ,

731 గ్రూప్ 2 ఉద్యోగాల కోసం కూడా 5 లక్షల మంది అప్లై చేశారనీ అన్నారు. గత ప్రభుత్వం పరీక్షలను సరిగా నిర్వహించలేదు. ప్రశ్నా పత్రాలను పల్లీ బఠానీల్లా అమ్మితే వారికి చీమకుట్టినట్లైనా లేదు. టీజీపీఎస్సీ ని సమూలంగా ప్రక్షాళన చేశామని, యూపీఎస్సీని స్వయంగా పరిశీలించి టీజీపీఎస్సీ ని ఏర్పాటు చేశాం, ఆర్ ఎంపీ డాక్టర్, డిప్యూటీ ఎమ్మార్వో, రిటైర్డ్ టీచర్ ను టీజీపీఎస్సీ సభ్యులు గా గత ప్రభుత్వం నియమించిందని అన్నారు.

తెలంగాణ నిరుద్యోగుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనీ, తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉన్నవాళ్లనే టీజీపీఎస్సీ సభ్యులు గా నియమించామని తెలిపారు.

ప్రభుత్వ టీచర్లు, గ్రూప్ 1,2,3 వంటి ఉద్యోగాలను ఒక బాధ్యతతో ఎలాంటి తప్పులు లేకుండా భర్తీ చేశామని,

నియామక పత్రాలు ఇవ్వొద్దని కుట్రలు చేసినా కోర్టుల ముందు కొట్లాడి భర్తీ చేశాం. రెండేళ్లలో దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు.

ఎల్బీ స్టేడియం, శిల్పారామం, సాగునీటి పారుదల శాఖ కార్యాలయం, అంబేద్కర్ విగ్రహం సాక్షి గా నియామక పత్రాలను అందజేశాం, భవిష్యత్తు తరాలకు మీ ఉద్యోగాలు దిక్సూచిగా మారుతుంది అని ఆయన అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక భావోద్వేగం,

తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో మీమ్మల్ని భాగస్వాములు చేస్తోందనీ,

25 ప్రభుత్వ శాఖల్లో 1370 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం,

ఉద్యోగ నియామకాలతో మమ్మల్నీ కలిసి మీ కళ్లలో ఆనందం చూడాలనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూ విద్య, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలో హరిత విప్లవాన్ని తీసుకువచ్చి అహార భద్రత కల్పించింది మాజీ ప్రధాని నెహ్రూ, విద్య అందరికి అందుబాటులో ఉన్నప్పటికి నాణ్యమైన విద్య ప్రజలకు అందడం లేదు, 16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్నారు,

11 వేల ప్రైవేట్ స్కూల్స్ లో 33 లక్షల విద్యార్థులు చదువుతున్నారనీ, ప్రభుత్వ పాఠశాలపైన ఎందుకు విశ్వాసం తగ్గుతుందో ఆలోచించాలనీ అన్నారు. పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తే ప్రపంచంతో పోటీ పడగలమనే విశ్వాసం నాకుంది.

భారతదేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రం గా తెలంగాణ నిలబడింది. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరిని పండించి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం అని ఆయన చెప్పారు. క్వాలిటీ ఎడ్యూకేషన్, క్వాలిటీ ఫుడ్, స్కిల్ పైన దృష్టి పెడుతున్నాం , స్కిల్ లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడలేకపోతున్నాం

విద్యలో స్కిల్ చాలా ముఖ్యమైనదనీ స్కిల్ డెవలప్మెంట్ కోసం పనిచేయాల్సి ఉందన్నారు.

నాణ్యమైన విద్యను అందించే అవకాశం ప్రభుత్వం దగ్గర ఉంది..

విద్య ఒక్కటే జీవితాల్లో మార్పు, వెలుగులు తీసుకు వస్తుంది.

ప్రభుత్వానికి వారధులు, సారధులు ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు.

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా తెలంగాణ ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

గరం,నరం, బే షరమ్ నానుడి తప్పు అని ఉద్యోగులు నిరూపించాలనీ సూచించారు.

పేదల మోహంలో తల్లిదండ్రులను చూసుకుని ప్రభుత్వ ఉద్యోగులు సేవలు లక్ష్యంగా అందించాలని,

తల్లిదండ్రులను గౌరవం గా చూసుకొని ఉద్యోగుల జీతంలో 10 నుంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రులకు అందజేస్తామని,

తల్లిదండ్రులను సరిగా చూసుకోని వాళ్లు మానవ జన్మలో ఉండొద్దు.

తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనీ సూచించారు.

రాజకీయ పార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దనీ,

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం,

ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసనీ అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, హర్కర్ వేణుగోపాల్ రావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ,కాలే యాదయ్య ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, వివిధ శాఖల ఉన్నత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన 15 మంది నిందితుల అరెస్టు

## మరో 9 మంది పరారీ.. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 16 (ప్రభాత ఉదయం):





రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నవి 63.19 లక్షల నగదు, బ్యాంక్లో 1లక్ష రూపాయలు, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్లు, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో: 1. పసునూరి బసవ రాజు, వయసు: 32 సంవత్సరాలుఇయాదాద్రి జిల్లా. 2. జెల్లా పాండ, వయసు: 46 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా. 3. మహేశ్వరం గణేష్ కుమార్, వయసు: 39 సంవత్సరాలుఇయాదాద్రి జిల్లా. 4. ఈగజులపాటి శ్రీనాథ్ వయసు: 35 సంవత్సరాలు, జనగామ. 5. యెనగంధుల వెంకటేష్, జనగామ. 6. కోదురి శ్రావణ్ వయసు: 35 సంవత్సరాలు, జనగామ. 7. కొలిపాక సతీష్ కుమార్ వయసు: 36 సంవత్సరాలు, కొడకండ్ల (ఎం), జనగామ. 8. తదూరి రంజిత్ కుమార్ వయసు 39 సంవత్సరాలు, నర్మెట్ట, జనగామ. 9. దుంపల కిషన్ రెడ్డి, వయసు: 29 సంవత్సరాలు, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, 10. దశరథ మేఘావత్ వయసు: 28 సంవత్సరాలుతురుపల్లి. 11. నారా భాను ప్రసాద్, వయసు: 30 సంవత్సరాలు, యాదగిరిగుట్ట, 12. గొపగాను శ్రీనాథ్, వయసు: 32 సంవత్సరాలు, శివ కుమార్, వయస్సు 33, అమంగల్, నల్లగొండ. 15. అలేటి నాగరాజు, వయస్సు 32, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

యాదాద్రి జిల్లా, 13. ఒగ్గు కర్నాకర్, వయసు: 42 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా. 14. కమల్ల

ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ శుక్రవారం వివరాలను వెల్లడిస్తూ ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్లలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారు. ఇందులో నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చేల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుండి అన్లైన్ సర్వీస్ వ్యక్తులకు, మద్యవర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణి, భూభారతీ వెబ్సైట్లో ఇన్స్పెక్ట్ " ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుము తగ్గించేవాడు. అనంతరం అట్టి ఛలాన్ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడని.

ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ, రిజిస్ట్రేషన్ కార్యాలయములో మద్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొదుతూ మోసాలకు పాల్పడేవారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడి కావున జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మద్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారు.ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారు.

ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయి. ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

ఈ ముఠా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి చేతన్. జనగామ ఇన్స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.



# ధరూర్ ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలిసిన వామన్ సర్పంచ్

గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి 16(ప్రభాత ఉదయం)

ధరూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ నందీకర్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుక్రవారం ధరూర్ మండల వామన్ పల్లి గ్రామ సర్పంచ్ పర్నికా కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నూతన ఎస్ఐను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఐ ని కలిసి వారిలో నాయకులు కృష్ణా రెడ్డి, గోవర్ధన్ రెడ్డి , వార్డ్ మెంబెర్ కిష్టమ్మ గోపాల్, జగదీష్ గౌడ్, కుర్వ లక్ష్మణ, చంద్రాములు , హనుమంతు, బంటు వీరేష్, వామన్ పల్లి, నర్సన్ దొడ్డి, జీర బండ ప్రజలు ఉన్నారు.



# కోతులగిద్దలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ధరూర్, జనవరి 16 ( ప్రభాత ఉదయం)

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ధరూర్ మండలం కోతులగిద్ద గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను గ్రామ సర్పంచ్ కుర్వగోవిందమ్మ రంగన్న, నాయకులు శ్రీనివాసరావు ఘనంగా ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం అందించడం ఎంతో అవసరమని, ఇలాంటి టోర్నమెంట్లు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రీమియర్ లీగ్ మ్యాచ్ లో మొత్తం నాలుగు జట్లు పాల్గొనున్నాయి. టోర్నమెంట్ లో విజేతలకు మొదటి బహుమతి గ్రామ సర్పంచ్ కుర్వగోవిందమ్మ 10,116, రన్నరప్ జట్టుకు జి.కరుణ రూ.7,516 నగదు ప్రోత్సాహం అందజేయనున్నారు. ప్రీమియర్ లీగ్ మ్యాచ్ లో పాల్గొన్న క్రీడాకారులకు జెర్సీలు సుభాన్, వాసు, వెంకటేష్, జంగిలప్పఅబ్రశ్రీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్ రావు, నిర్వాహకులు సుభాన్,అబశ్రీశ్రీ యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పురపాలిక ఎన్నికల రిజర్వేషన్లను పకడ్బందీగా ఖరారు చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్


గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి16(ప్రభాత ఉదయం)

పురపాలిక ఎన్నికల నిర్వహణకు ఆయా వర్గాల జనాభా, ఓటర్ల సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లను పకడ్బందీగా ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పురపాలిక ఎన్నికల రిజర్వేషన్లపై జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ, బీసీ, తదితర వర్గాల ఓటర్ల సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు ఆయా మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా మహిళ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీగా ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఇతర ప్రక్రియ మొత్తం నిర్దేశిత సమయంలోగా పూర్తి కావాలన్నారు. ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్, ప్రిసైడింగ్, ఇతర అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అదే మున్సిపాలిటీకి సంబంధించిన వారు కాకుండా ఇతర మండలాల వారిని తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, శంకర్ నాయక్, సైదులు, రాజయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాలిపటం ఎగురవేస్తు కుప్పకూలి మరణించిన యువకుడు

బుద్వేల్, జనవరి 16 (ప్రభాత ఉదయం)

ఎం ఎం పహడీ బస్తీలో గాలిపటం ఎగురవేస్తున్న పర్వాన్ అనే బాలుడు అక్కడిక్కడే కుప్పకూలిపోయి మరణించాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన ఈ నెల 14వ తేదీన జరిగింది. అత్తాపూర్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి..... ఎం ఎం పహడీ కి చెందిన ఫర్వాన్ ఈ నెల 14న తమ ఇంటి పరిసరాలలో గాలిపటం ఎగురవేస్తు కుప్పకూలిపోయాడు. అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణిం చినట్లు డాక్టర్లు తెలిపారు. గుండెపోటుతోనే ఫరాన్ మరణించినట్లు పోలీసులు అనుమానిసు న్నారు.



ఫర్వాన్

# మందార పువ్వుల టీతో..
# ఆరోగ్యకర ప్రయోజనాలు



హైబిస్కస్ టీ.. దీనిని రోసెల్లే టీ లేదా సోర్రెల్ టీ అని కూడా పిలుస్తారు. అదేనండి మన తెలుగు భాషలో మందార పువ్వుల టీ. ఇది మందార పువ్వు ఎండిన రేకుల నుండి తయారు చేయబడిన ఒక ప్రసిద్ధ మూలికా పానీయం. ఇది పుల్లని, రిఫ్రెష్ రుచిని కలిగి ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి ఇష్టమైన పానీయంగా మారుతుంది. దాని రుచికరంతో పాటు, మందార టీ అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. మరి వాటి వివరాలు ఒకసారి చూస్తే..

**యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి:**
మందార టీ ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి దాని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే హానికరమైన అణువులు. మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపును తగ్గించవచ్చు.

**రక్తపోటును తగ్గిస్తుంది:**
మందార టీ రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని అనేక అధ్యయనాలు చూపించాయి. ఇది శరీరానికి అదనపు సోడియం, నీటిని విసర్జించడానికి సహాయపడుతుంది. రక్త పరిమాణాన్ని తగ్గించడం ద్వారా మందార టీ ధమనుల గోడలపై ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా రక్తపోటు, ఇతర హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**బరువు తగ్గడానికి సహాయపడుతుంది:**
హైబిస్కస్ టీ బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఇది జీవక్రియను పెంచడానికి, కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామ దినచర్యకు గొప్ప అదనంగా ఉంటుంది. అదనంగా, మందార టీ లక్షణాలు ఉబ్బరం, నీటిని నిలుపుకోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా మీరు సన్నగా కనిపిస్తారు. మంచి అనుభూతి చెందుతారు.

**జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:**
మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. మందార టీ దాని శోథ నిరోధక లక్షణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. ఇది జీర్ణ వ్యవస్థను ఉపశమనం చేయడానికి మరియు అసౌకర్యాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**
మందార టీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన పోషకం. విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఇవి అంటువ్యాధులు, వ్యాధులతో పోరాడటానికి బాధ్యత వహిస్తాయి. మందార టీని క్రమం తప్పకుండా తాగడం వల్ల మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ఏడాది పొడవునా మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.



# టేస్టీ.. హెల్తీ..
# కర్బూజా స్మూతీ

**డ్రై ఫ్రూట్స్ తినడానికి ఎంత టేస్టీగా ఉంటాయో.. వీటి వల్ల బెనిఫిట్స్ కూడా అన్నీ ఉంటాయి. వీటిని స్మూతీలా చేసుకుని తీసుకుంటే బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తుంది. ఈ ఫ్లేవర్‌ని కూడా చాలా మంది ఇష్టపడతారు. ఇది ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు ఎన్నో లాభాలని అందిస్తుంది. మరి దీనిని ఎలా చేయాలి. తాగడం వల్ల ఏయే లాభాలో తెలుసుకోండి.**

**కావాల్సిన పదార్థాలు..**

**పండిన అరటిపండు 1**
1 కప్పు పాలు
2 టేబుల్ స్పూన్ల ఆల్మండ్ బటర్
1 టేబుల్ స్పూన్ తేనె
గుప్పెడు డ్రై ఫ్రూట్స్
కొన్ని ఐస్‌క్యూబ్స్

**ఖర్బూజా స్మూతీ..**

**తయారీ విధానం..**
ముందుగా అరటిపండు తొక్కని తీసి చిన్న ముక్కలుగా కట్ చేయండి.
ఇందులో పాలు, ఆల్మండ్ బటర్, తేనె, డ్రై ఫ్రూట్స్, ఇష్టమనుకుంటే ఐస్‌క్యూబ్స్ వేసి బ్లెండ్ చేయండి.
దీనిని మంచి టెక్చర్ వచ్చేవరకూ బ్లెండ్ చేయండి.
దీనిని ఓ గ్లాస్‌లో వేసి పై నుంచి డ్రైఫ్రూట్స్ తురుముని వేసి ఎంజాయ్ చేయడమే.

**దీని వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.**
గట్ హెల్త్..
ఈ స్మూతీలో హై ఫైబర్ ఉంటుంది. దీంతో మీకు డైజెషన్ ప్రాబ్లమ్స్ దూరమవుతాయి. బ్లోటింగ్, అసిడిటీ, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి.
ఇమ్యూనిటీ..
ఈ డ్రై ఫ్రూట్స్‌లో నేచురల్ షుగర్స్ ఉంటాయి. అవే ఫ్రక్టోస్. అదే విధంగా విటమిన్స్, మినరల్స్ అన్నీ కూడా ఇన్‌స్టంట్‌గా శక్తిని అందిస్తాయి. అదే విధంగా ఇవి మీ ఇమ్యూనిటీనీ పెంచుతాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ మీకు ఎలాంటి ఆరోగ్యా సమస్యలు రాకుండా కాపాడతాయి.

**బరువు తగ్గడం..**
ఈ స్మూతీని తాగడం వల్ల మన టేస్టీ బడ్స్ సాటిస్‌పై అవుతాయి. దీంతో ఎక్కువగా తినరు. హెల్దీ వెయిట్‌ని మెంటెయిన్ చేయొచ్చు. ఇందులో ఎండుద్రాక్ష, ఖర్జూరాలు, ఆప్రికాట్స్ ఉంటాయి. ఇవన్నీ ఎక్కువగా తియ్యగా ఉంటాయి. దీంతో పంచదార కలపాల్సిన అవసరం లేదు. ఇందులో ఫైబరీ కంటెంట్ ఉంటుంది. దీని వల్ల చాలా సమయం వరకూ కడుపు నిండుగా ఉంటుంది. ఆకలి అవ్వదు. వీటిని తీసుకోవడం వల్ల క్రేవింగ్స్ కూడా కంట్రోల్ అవుతాయి. దీనిని తీసుకోవడం వల్ల వెయిట్‌లాస్‌కి హెల్ప్ అవుతుంది. మీరు వీటిని తీసుకున్నప్పుడు కేలరీలని కూడా గుర్తుంచుకోవాలి. ఇందులోని హెల్దీ ఫ్యాట్స్ మీ బరువుని తగ్గిస్తాయి.

**బ్రెయిన్ హెల్త్..**
ఈ స్మూతీనిని తీసుకోవడం వల్ల బ్రెయిన్ హెల్త్ కూడా మెరుగవుతంది. ఈ నట్స్‌లో ఎక్కువగా ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా బ్రెయిన్ హెల్త్‌ని కాపాడతాయి. ఇన్ని లాభాలున్న స్మూతీని మీరు కచ్చితంగా ట్రై చేయండి.

# గులాబ్ జామూన్ పౌడర్‌తో కేక్



చాలా మందికి గులాబ్ జామ్స్ అంటే చాలా ఇష్టం. ఒక దాని తర్వాత మరొకటి లాగించేస్తారు. గులాబ్ జామ్స్ ఐస్ క్రీమ్స్‌తో తిన్నా చాలా రుచిగా ఉంటాయి. ఇలా గులాబ్ జామ్స్ అంటే చాలా మందికి ఇష్టం.

గులాబ్ జామ్స్ తయారు చేసే పౌడితో మనం కేక్ కూడా తయారు చేసుకోవచ్చు. అది కూడా ఎగ్ లేకుండా. ఎగ్ లేకుండా చేసే కేక్ ఎప్పుడైనా సరే తినవచ్చు. గులాబ్ జామ్స్‌తో తయారు చేసే కేక్ కూడా చాలా రుచిగా ఉంటుంది. సింపుల్‌గా కూడా చేసుకోవచ్చు. మరి గులాబ్ జామ్స్ పౌడర్‌తో చేసే కేక్ ఎలా తయారు చేస్తారు? దీనికి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**గులాబ్ జామ్ కేక్‌కి కావాల్సిన పదార్థాలు:**
గులాబ్ జామ్ పౌడర్, మైదా, చక్కెర, పెరుగు, నెయ్యి, పాలు వెనీలా ఎసెన్స్, రోజ్ ఎసెన్స్, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, కుంకుమ పువ్వు, యాలకుల పొడి.

**గులాబ్ జామ్ కేక్ తయారీ విధానం:**
ముందుగా పంచదారను మిక్సీలో వేసి పౌడర్‌లా చేసుకోవాలి. ఆ తర్వాత అర కప్పు పెరుగు పంచదార పొడిలో వేసుకోవాలి. ఇందులో పావు కప్పు నెయ్యి వేయాలి. ఈ మూడు ఉండలు లేకుండా.. బాగా కలిసి పోయేలా బీట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇందులో పాలు కూడా పోసి మళ్లీ మిక్స్ చేసుకోవాలి. ఇప్పుడు గులాబ్ జామ్ పౌడర్, మైదా తీసుకుని రెండింటినీ జల్లించుకోవాలి. ఇప్పుడు ఈ చల్లించుకున్న పొడిని కూడా పంచదార మిశ్రమంలో వేసి మరోసారి బాగా బీట్ చేసుకోవాలి. మొత్తం అన్నీ చక్కగా మిక్స్ అయిపోవాలి. అప్పుడే కేక్ చక్కగా పొంగి, మెత్తగా వస్తుంది. ఆ నెక్ట్స్ రోజ్ ఎసెన్స్, వెనిలా ఎసెన్స్, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, యాలకుల పొడి కూడా మళ్లీ మిక్స్ చేసుకోవాలి.

ఇప్పుడు కేక మౌల్డ్ తీసుకుని.. నెయ్యి లేదా బటర్ రాసుకోవచ్చు. అందులోనే ఒక స్పూన్ మైదా పిండి చల్లించి.. మౌల్డ్ ని కోట్ చేయాలి. ఇప్పుడు కేక్ మిశ్రమాన్ని మౌల్డ్‌ల వేసి.. ఓవెన్‌లో 170 డిగ్రీల ప్రీ హీట్‌లో 40 నిమిషాలు కుక్ చేసుకోవాలి. కేక్ అయిపోయిన తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్లీ కొద్దిగా పంచదార తీసుకుని స్టవ్ మీద పెట్టి.. కరగనివ్వాలి. ఇందులో కొద్దిగా కుంకుమ వ్వు వేసుకోవాలి. పంచదార బాగా కరిగాక.. ఈ సిరప్‌ని కేక్‌పై వేయాలి. అంతే ఎంతో రుచిగా ఉండే గులాబ్ జామ్ పౌడర్ కేక్ సిద్ధం. ఇది పిల్లలకు ఖచ్చితంగా నచ్చుతుంది.

# జుట్టు ఎక్కువగా రాలుతోందా?

హెయిర్ ఫాల్. నూటికి 90 శాతం మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఇది ఒకటి. చిన్న, పెద్ద తేడా లేదు. మూడుపదుల వయసైనా నిండకుండానే జుట్టు రాలిపోయి.. బట్టతల అవుతుంది. పట్టణాలు, మెట్రో సిటీల్లో ఉండే వారికైతే ఈ సమస్య అధికంగా ఉంటోంది. జుట్టురాలడం తగ్గాలని రకరకాల షాంపూలు, నూనెలు వాడుతుంటారు. వాటి వల్ల హెయిర్ ఫాల్ మరింత పెరుగుతుందే తప్ప ఫలితం
ఉండదు. చాలామంది.. మేం చిన్న పిల్లలుగా ఉన్నపుడు మా జుట్టు చాలా బాగుండేది. ఇప్పుడేమో కొత్తమీర కట్టలాగా తయారైందని వాపోతుంటారు. తేడా ఏంటంటే.. అప్పుడు అంతా అమ్మ చేసిన వంట తినేవారు. ఇప్పుడేమో ఫాస్ట్ ఫుడ్స్, బిర్యానీలు, పిజ్జాలు, బర్గర్లు, కేక్‌లు, వగైరా ఆహారాలు తింటున్నారు. వాటిలో వాడే హైలీ ఫ్యాటెడ్ కంటెంట్ శరీరానికి ఏ మాత్రం మంచిది కాదు. బయట మార్కెట్లో దొరికే షాంపూలకు బదులుగా కుంకుడుకాయలు వాడటం అలవాటు చేసుకోండి. అలాగే కెమికల్స్ తో తయారు చేసిన సీరమ్ కు బదులుగా మీ ఇంట్లోనే హెయిర్ సీరమ్ తయారు చేసుకుని వాడండి. జుట్టు ఆరోగ్యంగా, షైనీగా ఉండటంతో పాటు రాలడం తగ్గి.. పెరుగుతుంది.

**హెయిర్ ఫాల్ ను తగ్గించే సీరమ్ తయారీకి కావలసిన పదార్థాలు**

నీరు -1 గ్లాసు
బియ్యం -1 టీ స్పూన్
అవిసె గింజలు -1 టీ స్పూన్
మెంతులు -1 టీ స్పూన్
కరివేపాకు -10-12 ఆకులు

**తయారీ విధానం**
స్టవ్ పై ఒక గిన్నెను పెట్టుకుని అందులో గ్లాస్ నీరు పోయాలి. ఇప్పుడు పైన చెప్పిన పదార్థాలను ఆ క్వాంటిటీలో ఒక్కొక్కటిగా వేసి.. 5 నిమిషాల పాటు మరిగించుకోవాలి. ఈ నీటిని వడకట్టుకుని 1 టీ స్పూన్ కొబ్బరినూనెను వేసి కలుపుకోవాలి. అంతే హెయిర్ ఫాల్ కంట్రోల్ సీరమ్ రెడీ. ఈ సీరమ్ ను డ్రై హెయిర్ పై అప్లై చేసుకుని అలాగే ఉంచుకోవాలి. మీకు నచ్చకపోతే ఆరిపోయాక వాష్ చేసుకోవచ్చు. ఇలా వారానికి 2 సార్లు చొప్పున చేస్తే.. హెయిర్ ఫాల్ క్రమంగా తగ్గి.. జుట్టు పెరుగుతుంది.





Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608